# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com



సంపుటి : 3 | సంచిక : 319 | మంగళవారం 7 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




## ప్రజల సంక్షేమం తప్ప.. వ్యక్తిగత ప్రయోజనాలు లేవు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం
- రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం
- ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం

## వారు రాజకీయ ప్రత్యర్థులే తప్ప
# శత్రువులు కాదు

- ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తాం
- ఆదిలాబాద్ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి
- త్వరలోనే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేస్తామని వెల్లడి
- బాసర ఆలయ అభివృద్ధికి రూ.220 కోట్ల మంజూరు
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినప్పటికీ, అన్ని నియోజకవర్గాలకు నిధులు ఇస్తున్నాం



ఆదిలాబాద్

గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ సర్కారు తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. ఈ జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్నటువంటి ఆలయాలన్నింటిని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లాలో పలు - మిగతా3లో



## సీఎం దేవుడేమీ కాదు!

- మోదీ, పినరయి విజయన్ అహంకారులు'
- రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు
- కేరళ ఎన్నికల కోసం బీజేపీ, సీపీఎం మధ్య డీల్
- ప్రియాంక గాంధీ ఆరోపణ
- "ఎల్‌డీఎఫ్‌కు ఒక అదృశ్యహస్తం సహాయం చేస్తోంది
- ప్రస్తుత ప్రభుత్వం నిజమైన వామపక్షంలా పరిపాలన చేయడం లేదు.

## పుష్కలంగా ఆహార నిల్వలు

- దేశంలో మూడు రెట్లు అధికంగా ఆహార నిల్వలు
- దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగలేదు
- నిత్యావసర వస్తువుల ధరల విషయంలో కీలక ప్రకటన చేసిన కేంద్ర ప్రభుత్వం
- దేశంలో పుష్కలంగా ఆహార నిల్వలు ఉన్నాయన్న మోదీ సర్కార్




# ఇదీ మా అభివృద్ధి

- పినరయి విమర్శలపై సీఎం రేవంత్ సుదీర్ఘ లేఖ
- సీఎం పినరయి విజయన్‌పై నాకు అపారమైన గౌరవం ఉంది
- ఆయన చేసిన ట్వీట్లను శ్రద్ధగా చదివాను
- రెండు రాష్ట్రాల ప్రజల ముందు నిజాలు వెల్లడించడం నా బాధ్యత.
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రూ.20,617 కోట్ల మేర రైతు రుణాలను మాఫీ చేశాం
- 25.36 లక్షల మంది రైతులను రుణ విముక్తుల్ని చేశాం
- ఇది తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది.



హైదరాబాద్

కేరళ సీఎం పినరయి విజయన్ చేసిన విమర్శలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలకు ఉన్న సారూప్యతను బేరీజు వేసి సుదీర్ఘమైన వివరణ ఇస్తూ ఆయనకు లేఖ రాశారు. రెండు రాష్ట్రాల్లో అభివృద్ధి, అక్షరాస్యత, తదితర అంశాలను పూర్తి గణాంకాలతో వివరించారు. "సీఎం పినరయి విజయన్‌పై నాకు అపారమైన గౌరవం ఉంది. ఆయన చేసిన ట్వీట్లను శ్రద్ధగా చదివాను. రెండు రాష్ట్రాల ప్రజల ముందు నిజాలు వెల్లడించడం నా బాధ్యత. మీరు చేసిన విమర్శలకు పూర్తి గణాంకాలతో సమాధానం ఇస్తున్నాను. 2024-25 ఆర్థిక ఏడాదిలో తెలంగాణ జీఎస్‌డీపీ వృద్ధి 10.1 శాతంగా ఉంది. ఇది జాతీయ జీడీపీ 9.9 శాతం కంటే - మిగతా3లో



## సోమవారంలోపే 60లక్షల క్లెయిమ్‌ల పరిష్కారం

- బెంగాల్ ఎస్ఐఆర్‌పై సుప్రీం కోర్టు విచారణ
- అభ్యంతరాల పరిష్కారంపై సంతృప్తి వ్యక్తం చేసిన సర్వోన్నత న్యాయస్థానం
- రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర బలగాలను ఉపసంహరించేది లేదు

## చొరబాటుదారులను బాధితులుగా చూపిస్తున్న కాంగ్రెస్

- "బీజేపీ అసోంలోని అక్రమ భూఆక్రమణలను అరికట్టాలని చూస్తోంది
- స్వదేశీ ప్రజలను ముప్పులోకి నెట్టే ప్రయత్నం: మోదీ
- 'మహిళా రిజర్వేషన్ చట్టం వల్ల రాష్ట్రాల ప్రాతినిధ్యానికి ఎలాంటి ఢోకా ఉండదు'
- అసోం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు





## పట్టు బిగిస్తున్న
# రేవంత్

ముఖ్యమంత్రిగా ఎన్నికైన తొలి రోజుల్లో కాస్త ఇబ్బంది పడ్డారు
ఆ తర్వాత పరిపాలన మీద పట్టు సాధించడం మొదలుపెట్టారు
మంత్రుల మీద కూడా తన మార్క్ పెత్తనం ప్రదర్శిస్తున్నారు
ఆర్థిక పరిపుష్టి ఉన్న నాయకుడు కావడంతో అధిష్టానం రేవంత్ రెడ్డికి కేరళ బాధ్యతలు అప్పగించింది

హైదరాబాద్

రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రిగా ఎన్నికైన తొలి రోజుల్లో కాస్త ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత పరిపాలన మీద పట్టు సాధించడం మొదలుపెట్టారు. మంత్రుల మీద కూడా తన మార్క్ పెత్తనం ప్రదర్శిస్తున్నారు. అధిష్టానం ఎదుట మంచి మార్కులు సాధించుకొని.. గట్టి లీడర్ గా ఎదిగారు. కర్ణాటక.. ఇంకా కొన్ని ప్రాంతాలలో అధికారంలో ఉన్నప్పటికీ.. ఆర్థిక పరిపుష్టి ఉన్న నాయకుడు కావడంతో అధిష్టానం రేవంత్ రెడ్డికి కేరళ బాధ్యతలు అప్పగించింది. దేశంలో ప్రస్తుతం ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో కేరళ కూడా ఉంది. కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్నారు రేవంత్ రెడ్డి. తెలంగాణ రాష్ట్రాన్ని చెందిన ఇతర ముఖ్య నేతలు కూడా ప్రస్తుతం కేరళలోనే మకాం వేశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు.. ఫైర్ బ్రాండ్ లీడర్లు.. గట్టి స్వరం ఉన్న నాయకులు కేరళ రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రచారం చేస్తున్న వారిలో దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా ఉన్నారు. తన రాజకీయ జీవితంలో తొలిసారి కేరళ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి.. కేరళ రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో నిర్వహిస్తున్న - మిగతా3లో



## పాకిస్థాన్ బెదిరింపులపైనా మోదీ స్పందించలేదు

- ప్రధాని రాజీనామా చేయాలి : మమత కీలక వ్యాఖ్యలు
- కోల్‌కత్తాను లక్ష్యంగా చేసుకుంటామని పాకిస్థాన్ రక్షణ మంత్రి హెచ్చరిక
- బెంగాల్ ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ఆ విషయాన్ని ఎందుకు ప్రస్తావించలేదు
- మేం కఠిన చర్యలు తీసుకుంటామని ఎందుకు అనలేదు

## ఏఐతో దోమలను నియంత్రించవచ్చు

- ప్రొఫెసర్ రెడ్యా నాయక్
- హైదరాబాద్ నగరాన్ని వణికిస్తున్న దోమలు
- నిద్రలేని రాత్రులు గడుపుతున్న నగరవాసులు
- ఏఐ ఉపయోగించి దోమల నివారణకు జీహెచ్ఎంసీ కృషి
- ఓయూ జీవశాస్త్ర విభాగంతో కలిసి దోమల నియంత్రణకు ప్రయోగాలు

హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో దోమల ఉద్ధృతికి నగరవాసులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. దోమకాటుతో సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఆస్పత్రుల పాలవుతున్నారు. క్యులెక్స్, ఎడిస్ దోమల కాటుతో డెంగ్యూ, మలేరియా జ్వరాలతో అల్లాడిపోతున్నారు. దోమల నివారణకు అనేస పద్ధతులు పాటిస్తున్నప్పటికీ ఏ మాత్రం ఫలితం ఉండటం లేదు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన - మిగతా3లో



# చొరబాటుదారులను బాధితులుగా చూపిస్తున్న కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం విమర్శల వర్షం గుప్పించారు. అసోంలో చొరబాటుదారులకు కాంగ్రెస్ మద్దతు ఇస్తోందని, అక్రమ భూఆక్రమణలకు వ్యతిరేకంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అడ్డుకుంటోందని ఆరోపించారు. బార్పేటలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించిన ఆయన, చొరబాటుదారులను 'బాధితులు'గా పరిగణించే చట్టాలను తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, దీని ద్వారా స్వదేశీ ప్రజలు ప్రమాదంలో పడుతుందని మోదీ పేర్కొన్నారు. "బీజేపీ అసోంలోని అక్రమ భూఆక్రమణలను అరికట్టాలని చూస్తోంది. కానీ కాంగ్రెస్ బహిరంగంగానే చొరబాటుదారులకు మద్దతు ఇస్తోంది. పైగా అక్రమ ఆక్రమణలకు అడ్డుకట్టవేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తోంది. అసోంలో కాంగ్రెస్ ఎలాంటి చట్టాన్ని తీసుకురావాలని అనుకుంటోందంటే, ఎవరైనా చొరబాటుదారుడు అనే పదాన్ని ఉపయోగిస్తే, వారు జైలుకు వెళ్లే పరిస్థితి వస్తుంది. కాంగ్రెస్? పార్టీ చట్టంలోనే చొరబాటుదారులను 'బాధితులు'గా పరిగణిస్తుంది. దీని వల్ల మెజారిటీ స్వదేశీ ప్రజలు జైలు శిక్ష ముప్పును ఎదుర్కోవాల్సి వస్తుంది." 'శ్రీమంత శంకరదేవ, మాధవదేవ, దామోదరదేవ, హరిదేవ్ మొదలైన వైష్ణవ సాధువుల పవిత్ర మఠాలకు చెందిన వేల బిగాల భూమి బార్పేటలో ఉంది. ఆ భూమిని చొరబాటుదారులు ఆక్రమించుకునేందుకు కాంగ్రెస్ అనుమతించింది. దీనితో చాలా భూభాగం అక్రమ ఆక్రమణలకు గురైంది' అని మోదీ ఆరోపించారు.

**కాంగ్రెస్‌కు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం!**

అసోం సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని నొక్కి చెబుతూ, బోడో సామాజిక వర్గానికి చెందిన 'హుదుమ్ పూజ', కోచ్?–రాజ్?బోంగ్షి వర్గానికి చెందిన 'బాతౌ' అనేవి అసోం సంస్కృతి,



ప్రకృతి, విశ్వాసాల మధ్య ఉన్న సామరస్యానికి ఉదాహరణలుగా ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం రాష్ట్ర ప్రయోజనాల కంటే, రాజకీయ అధికారానికే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, అందువల్ల అసోం సంప్రదాయాలకు గొప్ప నష్టం వాటిల్లిందని ఆయన అన్నారు.

**మహిళా రిజర్వేషన్స్ వల్ల నో ప్రోబ్లం!**

మహిళా రిజర్వేషన్ చట్టం అమలు కోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తుండడంపై విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. దీనిపై కూడా మోదీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వల్ల ఏ రాష్ట్ర ప్రాతినిధ్యానికీ భంగం వాటిల్లదని ఆయన పేర్కొన్నారు. అందువల్ల అన్ని రాజకీయ పార్టీల నేతలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో అమలులో ఉన్న జనాభా నియంత్రణ చర్యల గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

"ఏప్రిల్ 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటికే ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో మేము చర్చించాం. దేశంలోని సోదరీమణుల, కుమార్తెల హక్కులకు సంబంధించిన ఈ పనిని ఏకగ్రీవంగా ముందుకు తీసుకెళ్లాలని మేము అందరినీ కోరాం. అయితే కొందరు వ్యక్తులు ఈ గొప్ప కార్యంపై గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి దేశంలోని అన్ని రాష్ట్రాలు దీనివల్ల ప్రయోజనం పొందుతాయి. దీని వల్ల ఏ రాష్ట్రానికి నష్టం వాటిల్లదు. జనాభా నియంత్రణ ఎక్కువగా ఉన్న ఈశాన్య రాష్ట్రాలు కావచ్చు లేదా దక్షిణాది రాష్ట్రాలు కావచ్చు. వారి ప్రాతినిధ్యం ఏమాత్రం తగ్గదు. మహిళల కోసం అదనపు సీట్లు కేటాయించేలా మేము ఏర్పాట్లు చేస్తున్నాం. అలాగే ప్రస్తుతం ఉన్న సీట్లను మరింత పెంచాల్సిన అవసరం ఉంది. అందుకే, ఈ చట్టాన్ని అందరూ కలిగి ఆమోదించేలా రాజకీయ పార్టీల నేతలపై ఒత్తిడి తీసుకురావాలని నేను ప్రత్యేకంగా అసోం సోదరీమణులను కోరుతున్నాను."

**డీలిమిటేషన్?**

దేశంలోని నియోజకవర్గాల పునర్విభజన కోసం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా నిర్ణయించారు. దీనికి అనుగుణంగా డీలిమిటేషన్ చట్టాన్ని సవరించనున్నారు. ఈ చట్టాన్ని ఆమోదించడానికి 2/3వ వంతు మెజారిటీ అవసరం. అందుకే ప్రతిపక్ష పార్టీల మద్దతు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఏప్రిల్? 16 నుంచి జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే దీనిపై చర్చించనున్నారు.

# 'సీఎం దేవుడేమీ కాదు!

ప్రధాని నరేంద్ర మోదీ, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్? ఇద్దరూ 'అహంకారులు' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. వాళ్లిద్దరూ ప్రజలతో కలిసి పనిచేయడం కంటే, వారిపై పాలన సాగించాలనే మనస్తత్వం కలిగినవారని ఆయన ఆరోపించారు. కేరళలోని త్రిస్సూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడిన రాహుల్? గాంధీ, కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్, అధికార ఎల్?డీఎఫ్? మధ్యే ఉంటుందన్నారు. అయితే ఎల్‌డీఎఫ్‌కు బీజేపీ లోపాయికారంగా సహకరిస్తోందని విమర్శించారు. "ఎల్‌డీఎఫ్‌కు ఒక అదృశ్యహస్తం సహాయం చేస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం నిజమైన వామపక్షంలా పరిపాలన చేయడం లేదు. దీన్ని అధికార సీపీఎం కార్యకర్తలు కూడా అంగీకరిస్తారు. వాస్తవానికి దేశవ్యాప్తంగా చూసుకుంటే బీజేపీ తన ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్? అని భావిస్తోంది. కేరళలో అయితే కాంగ్రెస్? నేతృత్వంలోని యూడీఎఫ్?ను ప్రధాన ప్రత్యర్థిగా చూస్తోంది. దీనికి నిదర్శనం ఏమిటంటే, ప్రధాని మోదీ ఇతర చోట్ల తన ప్రసంగాల్లో దేవుడు, దేవాలయాలు, మతం గురించి మాట్లాడతారు. కానీ కేరళలో సీపీఎం నాయకులతో సంబంధం ఉన్న శబరిమల బంగారం మాయమైన అంశంపై మాత్రం మాట్లాడరు. ఎందుకంటే కేరళ ముఖ్యమంత్రిని, సీపీఎంను రక్షించాలని ఆయన కోరుకుంటున్నారు. ఎల్?డీఎఫ్?ను కాపాడడం కోసం ఆయన కేరళలో దేవుడిని, హిందూత్వాన్ని, దేవాలయాలను మర్చిపోయారు."



**నన్ను టార్గెట్ చేశారు!**

ప్రతిపక్ష నేతల విషయంలో బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను తమ ఇష్టారీతిన ఉపయోగించుకుంటున్నాయని రాహుల్ గాంధీ విమర్శించారు. "నేను వారిని విమర్శిస్తున్నాను కాబట్టి నా ప్రభుత్వ నివాసాన్ని, నా పార్లమెంట్ సభ్యత్వాన్ని లాగేసుకున్నారు. నాపై కేసులు పెట్టి, విచారణ చేశారు. కానీ కేరళ ముఖ్యమంత్రిని, ఆయన కుటుంబాన్ని మాత్రం తాకడం లేదు. ఆయనపై ఈడీ, సీబీఐ చర్యలు లేవు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'మేము ఇక్కడ ఒక పార్టనర్‌షిప్‌నకు (బీజేపీ, ఎల్‌డీఎఫ్) వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు స్పష్టమవుతోంది. మణిపూర్‌లో మంటలు పెట్టినవారు, ఛత్తీస్‌గఢ్‌లో నర్సులపై దాడి చేసినవారు, మత ప్రాతిపదికను భారతదేశాన్ని విభజించి ద్వేషాన్ని, హింసను వ్యాప్తి చేస్తున్నవారే ఆ భాగస్వాములు' అని రాహుల్ గాంధీ అన్నారు.

**సీఎం దేవుడేమీ కాదు!**

విజయన్ చిత్రంతో ఉన్న 'హూ ఎల్స్' (ఇంకెవ్వరు) అనే నినాదం ఉన్న ఎల్?డీఎఫ్? ప్రచార బోర్డులపై కూడా రాహుల్ విమర్శలు గుప్పించారు.? 'కేరళను పాలించడానికి ముఖ్యమంత్రి దేవుడు ఏమీ కాదు. రాష్ట్రంలో అపారమైన మేధస్సు, సామర్థ్యం ఉన్న మహిళలు, ప్రతిభావంతులు ఎందరో ఉన్నారు' అని పేర్కొన్నారు. హూ ఎల్స్? అనే నినాదం రాష్ట్ర ప్రజలను కించపరచడమేనని, అది అహంకారానికి పరాకాష్టగా అభివర్ణించారు. 'మేము పోరాడుతున్నది సరిగ్గా ఇలాంటి అహంకార పూరిత మనస్తత్వంతోనే. మోదీ, అమిత్? షా, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మలది కూడా ఇదే మనస్తత్వం. తాము ప్రజలను పాలించడానికే ఇక్కడ ఉన్నామనే భావన వాళ్లది. అయితే తాము మాత్రమే పాలించగలమని చెప్పుకోవడానికి ఇది మహారాజుల కాలం కాదు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**బీజేపీతో సీపీఎం డీల్**

మరోవైపు, కేరళలో ఏప్రిల్ 9న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం సీపీఎం నేతృత్వంలోని కూటమితో బీజేపీ డీల్ కుదుర్చుకుందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ ఆరోపించారు. 10 ఏళ్లపాటు అధికారంలో కొనసాగడం కోసం అధికార ఎల్‌డీఎఫ్ తన సిద్ధాంతాలు, జవాబుదారీతనం, బాధ్యతల విషయంలో పూర్తిగా రాజీపడిందని ఆమె విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర కేరళ జిల్లాలోని పెరవూర్?లో జరిగిన ఓ మీటింగ్?లో వయనాడ్ ఎంపీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

# పుష్కలంగా ఆహార నిల్వలు

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా దేశంలో నిత్యావసర వస్తువుల ధరల్లో ఎటువంటి అసాధారణ హెచ్చుతగ్గులేమీ లేవని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాలకు, అలాగే ఏవైనా అత్యవసర పరిస్థితులకు సరిపడా గోధుమలు, బియ్యం నిల్వలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి అనుపమ్ మిశ్రా వ్యాఖ్యానించారు. "దేశంలో ఆహార భద్రత పరిస్థితిని వినియోగదారుల వ్యవహారాల శాఖ నిశితంగా గమనిస్తోంది. ఆహార పదార్థాల ధరలను పర్యవేక్షిస్తున్నాం. అలాగే ఆహార పదార్థాల నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న 528 కేంద్రాల నుంచి వినియోగదారుల వ్యవహారాల శాఖ ప్రతిరోజూ 40 రకాల వస్తువుల ధరలను పొందుతుంది. హోల్‌సేల్, రిటైల్ ధరలు మొబైల్ యాప్‌లో అప్డేట్ చేస్తున్నాం. ఇప్పటివరకు మేము గమనించిన వరకు నిత్యావసర వస్తువుల ధరల్లో ఎటువంటి అసాధారణ హెచ్చుతగ్గులు లేవు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పప్పుధాన్యాల ఉత్పత్తి ఎక్కువగా ఉంది. ప్రభుత్వం వద్ద 28 లక్షల టన్నుల పప్పుధాన్యాల బఫర్ స్టాక్ ఉంది. ఉల్లిపాయలు, బంగాళదుంప, టమాటాల ఉత్పత్తి దాదాపు గతేడాది స్థాయిలోనే ఉంది." అని అనుపమ్ మిశ్రా పేర్కొన్నారు.

**'రాష్ట్రాలతో సంప్రదింపుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు'**

1955 నాటి నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం, వస్తువుల బ్లాక్ మార్కెటింగ్ లేదా నిల్వలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని అనుపమ్ మిశ్రా వెల్లడించారు. ఈ విషయంపై తాము రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, నిల్వల విషయంలో రాష్ట్రాలతో నిరంతరాయంగా సంప్రదింపులు జరిపేందుకు ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

**'దేశంలో మూడు రెట్లు అధికంగా ఆహార నిల్వలు'**




ప్రస్తుత బఫర్ నిబంధనల కంటే మూడు రెట్లు అధికంగా దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు ఉన్నాయని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి సి. శిఖ తెలిపారు. దేశంలో ప్రస్తుతం సుమారు 222 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలు, దాదాపు 380 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. దీంతో మొత్తం ఆహార నిల్వలు సుమారు 602 లక్షల మెట్రిక్ టన్నులకు చేరాయని పేర్కొన్నారు. ఈ నిల్వలు ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాలను, అలాగే ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వాటిని తీర్చడానికి సరిపోతాయని వ్యాఖ్యానించారు. "ఇండోనేసియా, మలేసియా, రష్యా, ఉక్రెయిన్, అర్జెంటీనా, బ్రెజిల్ వంటి కీలక భాగస్వాముల నుంచి భారత్‌కు దిగుమతులు నిలకడగా కొనసాగుతున్నాయి. ఇది మొత్తం సరఫరా స్థిరత్వానికి దోహదపడుతోంది. ఆవాలు ఉత్పత్తి మెరుగుపడటం వల్ల, ముఖ్యంగా వంట నూనెల విభాగంలో దేశీయ లభ్యత కూడా బలపడింది." అని స్పష్టం చేశారు.

**రెండు రోజుల్లో 2 భారతీయ నౌకలు హర్మూజ్‌ను దాటాయి : ముకేశ్ మంగళ్**

పశ్చిమాసియా ప్రాంతంలోని భారతీయ నావికులందరూ సురక్షితంగా ఉన్నారని, అక్కడ సముద్ర కార్యకలాపాలు స్థిరంగా కొనసాగుతున్నాయని పోర్ట్స్, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగళ్ వెల్లడించారు. గత 24 గంటల్లో భారత జెండా ఉన్న నౌకలకు సంబంధించి ఎలాంటి దుర్ఘటనలు జరగలేదని పేర్కొన్నారు. గత రెండు రోజుల్లో ఎల్‌పీజీని తీసుకువెళ్తున్న భారత జెండా కలిగిన రెండు నౌకలు గ్రీన్ సంఘ్వీ, గ్రీన్ ఆశా హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయని తెలిపారు. పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం 16 భారత జెండా కలిగిన నౌకలు ఉన్నాయని, వాటిలో మొత్తం 433 మంది భారతీయ నావికులు ఉన్నారని చెప్పారు.

**ఎల్‌పీజీ దిగుమతుల్లో సవాళ్లు : సుజాత శర్మ**

రష్యా చమురును దిగుమతి చేసుకునేందుకు భారత్‌కు అమెరికా ఇచ్చిన గడువు ముగిసిపోయినప్పటికీ, భౌగోళిక రాజకీయ అవాంతరాలు ఉన్నప్పటికీ భారత్ స్థిరమైన ఇంధన లభ్యతను కొనసాగించగలిగిందని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. అయితే ఎల్‌పీజీ దిగుమతులు, సహజ వాయువు సరఫరాలలో సవాళ్లు కొనసాగుతున్నాయని చెప్పారు. దేశం ముడి చమురు సేకరణ వ్యూహం పటిష్టంగా ఉందని అన్నారు. దేశంలో చమురు శుద్ధి కర్మాగారాలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

"ఎల్‌పీజీ విషయంలో పరిస్థితి మరింత సంక్లిష్టంగా ఉంది. దేశ ఎల్‌పీజీ దిగుమతుల్లో గణనీయమైన భాగం అంటే సుమారు 60 శాతం గతంలో ఒక నిర్దిష్ట ప్రాంతం నుంచి దిగుమతి అయ్యేది. ప్రస్తుతం ఆ ప్రాంతం భౌగోళిక రాజకీయ అస్థిరతతో ప్రభావితమైంది. దీంతో ఎల్‌పీజీ దిగుమతుల్లో తగ్గుదల కనిపిస్తోంది. ఇది కొంత ఆందోళన కలిగించే విషయం." అని సుజాత శర్మ అభిప్రాయపడ్డారు.

**ఇరాన్ నుంచి సేఫ్‌గా భారత్‌కు వచ్చిన 1777 మంది**

పశ్చిమాసియాలో యుద్ధం వేళ అర్మేనియా, అజర్‌బైజాన్‌ల మీదుగా ఇరాన్ నుంచి 1,777 మంది భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చామని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. ఇరాన్, అర్మేనియా, అజర్‌బైజాన్ దేశాల అధికారుల సహకారంతో ఇది సాధ్యమైందని పేర్కొంది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఇండియన్స్ తరలింపు ప్రయత్నాలను చురుకుగా సమన్వయం చేస్తోందని చెప్పింది. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు.

## పాకిస్థాన్ బెదిరింపులపైనా మోదీ స్పందించలేదు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి విరుచుకుపడ్డారు. కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామని పాకిస్థాన్ రక్షణ మంత్రి హెచ్చరిస్తుంటే, మోదీ మౌనం వహించడం దారుణమన్నారు. బంగాల్ ఎన్నికల పర్యటనలో ఆయన ఆ విషయం గురించి ఎందుకు ప్రస్తావించలేదని మండిపడ్డారు. ఆయన బంగాల్‌లో జరిగే ఎన్నికలను పట్టించుకుంటారు కానీ, పాక్ బెదిరింపులకు పాల్పడినా ఒక్క మాట కూడా మాట్లాడరని దుయ్యబట్టారు. దాయాది దేశం బెదిరింపులకు మౌనం వహించినందుకు గానూ మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం నాడియా జిల్లాలో జరిగిన ఎన్నికల సభలో మమతా ఈ మేరకు వ్యాఖ్యానించారు. "పాకిస్థాన్ రక్షణ మంత్రి చేసిన ప్రేలాపణలను బంగాల్‌లో సభలో ప్రధాని ఎందుకు ప్రస్తావించలేదు పాక్ కోల్‌కతాపై దాడి చేస్తామని చెప్పినప్పుడు, మేం కఠిన చర్యలు తీసుకుంటాం అని మోదీ ఎందుకు అనలేదు? దేశానికి వచ్చే ఏ బెదిరింపునైనా మనం ఎలాగైతే అంగీకరించమో, అలాగే కోల్‌కతాకు వచ్చే హెచ్చరికలను కూడా మేం చూస్తూ ఊరుకోం"

**మమతా బెనర్జీ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డ బీజేపీ**

మరోవైపు, బీజేపీని ఉద్దేశిస్తూ సీఎం మమత బెనర్జీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. బంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు పహల్గాం తరహా దాడికి బీజేపీ బ్లూప్రింట్ సిద్ధం చేసిందా అని మమత ప్రశ్నించారు. మోదీ మౌనం వెనుక ఏదైనా బ్లూప్రింట్ ఉందా? ఎన్నికల ముందు మరో పహల్గాం దాడి జరగబోతోందా అని ప్రశ్నించారు. కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామంటే భారత పౌరులుగా తాము సహించమని మమత తెలిపారు. అయితే, మమతా బెనర్జీ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆమె ఇలాంటి బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తింది. పహల్గాం ఉగ్రదాడిని మమత బ్లూప్రింట్ అని పేర్కొనడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేసింది.

**అసలేం జరిగింది**

భవిష్యత్తులో భారత్ ఏదైనా దాడులకు పాల్పడితే, కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని ఇటీవల పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. ప్రతిదాడులను ఆ ప్రాంతం వరకూ తీసుకెళ్తామంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎక్కడైనా కొంతమంది మృతదేహాలను పడేసి, వారు ఉగ్రవాదులేనని నమ్మించేలా భారత్ బూటకపు ఆపరేషన్ రూపొందించినట్లు నివేదికలు ఉన్నాయంటూ ఆయన ప్రేలాపణలు చేశారు. అయితే, వాటికి కచ్చితమైన ఆధారాలు ఆయన చూపలేదు. ఇది జరగడానికి ముందు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన చాలా తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఇందుకుగానూ ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత చేపట్టిన వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లను ఆయన ఉదహరించారు.

**బంగాల్ ఎన్నికల సమరం**

ఇదిలా ఉండగా, అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో బంగాల్?లో రాజకీయాలు రోజురోజుకీ మరింత హీటెక్కుతున్నాయి. ప్రధాన పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నాయి. ఈ క్రమంలో నదియా జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మమతా కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, కాంగ్రెస్, డీఎంకే మధ్య రహస్య ఒప్పందం ఉందని మమతా విమర్శించారు. బంగాల్‌కు చెందిన అనేక మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తమిళనాడుకు ఎన్నికల పరిశీలకులుగా పంపించారని ఆరోపించారు. అయితే, ఎన్నికల వేళ ఇతర రాష్ట్రాల్లో కొంతమంది అధికారులను బదిలీ చేస్తే, బంగాల్‌లో మాత్రం దాదాపు 500 మంది అధికారులను బదిలీ చేశారని దుయ్యబట్టారు. ఈ చర్యల వల్ల రాష్ట్ర అభివృద్ధి పనులు దెబ్బతిన్నాయని వ్యాఖ్యానించారు. అలాగే, బంగాల్‌లో కీలక స్థానాల్లో తమ అనుకూల అధికారులను నియమించి స్వేచ్ఛగా వ్యవహరించేలా ప్రయత్నిస్తున్నారని బీజేపీ ఉద్దేశిస్తూ మమతా ఆరోపణలు చేశారు. మరోవైపు, ఏప్రిల్ 8న తాను భవానీపూర్ నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు మమతా ప్రకటించారు. అయితే, ఎన్నికల అనంతరం దేశవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలను ఐక్యం చేసే దిశగా పనిచేస్తానని మమత తెలిపారు. కాగా, 294 అసెంబ్లీ స్థానాలకు గానూ బంగాల్?లో ఏప్రిల్? 23, 29 రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. అలాగే మే 4న ఫలితాలు విడుదల కానున్నాయి.

## సోమవారంలోపే 60లక్షల క్లెయిమ్‌ల పరిష్కారం

బంగాల్ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ జాబితా నుంచి తొలగించిన సుమారు 60 లక్షల మంది క్లెయిమ్?లు, అభ్యంతరాలను సోమవారం లోపే పరిష్కరించనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర బలగాలను ఉపసంహరించేది లేదని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్? ఎం. పాంచోలిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం, కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాసిన లేఖను ఊటంకిస్తూ, సోమవారం మధ్యాహ్నం నాటికి దాదాపు 60 లక్షల కేసుల్లో 59.15 లక్షల క్లెయిమ్‌లను జ్యుడీషియల్ అధికారులు పరిష్కరించారని పేర్కొంది. "గతంలో జరిగిన పరిణామాలను పరిగణనలోకి తీసుకుని, బంగాల్ నుంచి కేంద్ర బలగాలను ప్రస్తుతానికి ఉపసంహరించుకోవడం జరగదు. ఒకవేళ రాష్ట్ర యంత్రాంగం విఫలమైతే, తరువాత ఏం చేయాలో మేం ఆలోచిస్తాం" అని సీజేఐ పేర్కొన్నారు. ఇటీవల జ్యుడీషియల్ అధికారులపై ఘెరావ్ చేసిన మాల్డా జిల్లాలో కూడా దాదాపు 8 లక్షల కేసులు పరిష్కారం అయ్యాయని సర్వోన్నత ధర్మాసనం గుర్తించింది. మరోవైపు ఈసీ తరఫున హాజరైన సీనియర్ అడ్వొకేట్ డీఎస్ నాయుడు, మిగిలిన క్లెయిమ్‌లను ఈ రోజులోపే పూర్తి చేస్తామని, సోమవారం రాత్రికి అనుబంధ ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని కోర్టుకు తెలిపారు. అయితే పెండింగ్?లో ఉన్న డిజిటల్ సంతకాల అప్‌లోడింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏప్రిల్ 7 వరకు గడువు కావాలని ఆయన అడగగా, అందుకు కోర్టు అనుమతించింది. మరోవైపు బంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ తరఫున హాజరైన సీనియర్ అడ్వొకేట్ శ్యామ్ దివాన్?, ఓటర్ల తొలగింపు సవాళ్లను విచారణ చేయడానికి ఏర్పాటు చేసిన 19 అప్పీలేట్ ట్రిబ్యునళ్లు ఇంకా పూర్తి స్థాయిలో పనిచేయడం లేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు, ఈ ట్రిబ్యునళ్ల కోసం ఏకరీతి విధివిధానాలను రూపొందించడానికి ముగ్గురు మాజీ సీనియర్? న్యాయమూర్తులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని కోల్?కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆదేశించింది. అంతేకాదు అప్పీళ్లను వేగంగా పరిష్కరించేందుకు వీలుగా ఏప్రిల్ 7 నాటికి మార్గదర్శకాలను ఖరారు చేయాలని ఆ కమిటీని కోరింది. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులకు గల కారణాలను పరిశీలించే అధికారం సదరు ట్రిబ్యునళ్లకు ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాగే ఆన్?లైన్?లో అప్లోడ్ చేయని డాక్యుమెంటరీ ఆధారాలను కూడా సమీక్షించే అధికారం దానికుంటుందని తేల్చిచెప్పింది. మరోవైపు రివిజన్ ప్రక్రియలో జ్యుడీషియల్ అధికారులకు ఎదురవుతున్న బెదిరింపులు, ఆటంకాలపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. భద్రత కల్పించడంలో రాష్ట్ర యంత్రాంగం విఫలమైతే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అంతేకాదు, ట్రిబ్యునళ్లు సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా పనిచేసే వాతావరణాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం నొక్కి చెప్పింది. ఈ సందర్భంగా, 'ఎన్నికల కమిషన్ పాత్ర ఓటర్ల భాగస్వామ్యాన్ని విస్తరించడమే తప్ప, నియంత్రించడం కాదు' అని జస్టిస్ బాగ్జీ వ్యాఖ్యానించారు.

**మాల్దా ఘటనపై ఎన్ఐఏ దర్యాప్తు**

బంగాల్‌లోని మాల్దా జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ చేపడుతున్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులపై దాడి చేసి, ఘెరావ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసును సుప్రీంకోర్టు సోమవారం 'ఎన్ఐఏ'కు బదిలీ చేసింది. ఇందుకు తనకున్న విశేషాధికారాలను (ప్లీనరీ పవర్స్) ఉపయోగించింది. ఈ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'బంగాల్ బ్యూరోక్రసీ విశ్వసనీయత దిగజారుతోంది. సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల్లోకి కూడా రాజకీయాలను తీసుకువస్తున్నారు' అని మండిపడింది. మాల్దా ఘటనలో రాష్ట్ర పోలీసులు అరెస్టు చేసిన 26 మంది నిందితులు ప్రస్తుతం జ్యుడీషియల్? కస్టడీలో ఉన్నప్పటికీ, వారిని ఎన్?ఐఏ విచారణ చేయాలని కోర్టు ఆదేశించింది. అంతేకాదు, ఏప్రిల్ 1న జ్యుడీషియల్ అధికారులను ఘెరావ్ చేసిన సమయంలో కోల్?కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన ఫోన్? కాల్స్?ను ఎత్తని బంగాల్? ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దుష్యంత్? నారియాలను సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వెంటనే క్షమాపణ చెప్పాలని చీఫ్? సెక్రటరీని ఆదేశించింది. మాల్దా ఘటన ఏదో యాదృచ్ఛికంగా జరిగింది కాదని, అది ముందస్తు ప్రణాళికతో, దురుద్దేశంతో చేసిన దాడి అని న్యాయస్థానం అభిప్రాయపడింది.

# వారు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శత్రువులు కాదు

-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి కార్యక్రమాలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి శంకుస్థాపన చేసిన రేవంత్ రెడ్డి పిప్పిరిలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు.

**వారు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శత్రువులు కాదు**

ఆదిలాబాద్‌జిల్లా ప్రజలు అమాయకులే కాదు, నిరంకుశత్వంపై పోరాడినటువంటి వీరులు, కుమురంభీం లాంటి ఆదివాసీ వీరులు నిజాం నిరంకుశత్వంపై పోరాటం చేశారని రేవంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్వాకు ఆధునిక విద్య, వైద్యం లాంటి సదుపాయాలు ఇంకా దక్కలేదని వివరించారు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకుని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పోరాడారని సీఎం తెలిపారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం తమది కాదని వివరించారు. గతంలో సీఎం వస్తుంటే ప్రతిపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్బంధాలు చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినప్పటికీ, అన్ని నియోజకవర్గాలకు నిధులు ఇస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు తమకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే తప్ప శత్రువులు కాదని తెలిపారు.

"జూన్ రెండో తేదీలోగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి శిలాఫలకం వేసే బాధ్యతను మేమంతా తీసుకుంటాం. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగానే కాకుండా, ఒక పారిశ్రామిక కేంద్రంగా మారుస్తాం. ఆదిలాబాద్? ప్రాంతంలో వేలాది ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడను మంజూరు చేసి ఇక్కడ ఉండే ఆదివాసీ బిడ్డలకు, చదువుకున్న యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇప్పించేందుకు



కృషిచేస్తున్నారు. ఇందుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఆదిలాబాద్?కు యూనివర్సిటీ ఇవ్వడమే కాకుండా, ప్రారంభోత్సవ కార్యక్రమానికి త్వరలోనే నేను వస్తా" -రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

**మండలాలు, జిల్లాల హద్దులు మార్చేది అప్పుడే**

2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే ప్రజల ఆకాంక్షల మేరకు హద్దులు మారుస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లను పేదల ఖాతాల్లో జమచేశామన్న ఆయన సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా? అని ప్రశ్నించారు. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం దేశంలో మరొకటి లేదని అన్నారు. యువత మత్తుబాట వదిలి మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నట్లుగా తెలిపారు. ఆదాయం పెంచాలి, పేదలకు పంచాలి అనే ఆశయంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. బాసర ఆలయం అభివృద్ధికి రూ.220 కోట్లు మంజూరు చేశామని ఆయన పేర్కొన్నారు. దేశంలోనే గొప్ప సరస్వతి ఆలయంగా బాసరను అభివృద్ధి చేస్తామన్నారు. గూడెం సత్యనారాయణ ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు.

**ఆదిలాబాద్‌ను అగ్రగామిగా నిల్పుతాం**

విద్యా, ఉద్యోగ, ఉపాధి కల్పనలో ఆదిలాబాద్‌ను అగ్రగామిగా నిలుపుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడని ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని తెలిపారు. అంతకుముందు ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గిరిజన జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్ జిల్లాకి విమానాశ్రం సౌకర్యాన్ని కల్పించి పర్యాటకంగానే కాకుండా పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరిలో నీళ్లు పారిస్తామన్నారు. గూడెం సత్యనారాయణస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం అన్నారు.

# ఏఐతో దోమలను నియత్రించవచ్చు

-మొదటిపేజీ తరువాయి

బల్దియా సంప్రదాయ పద్దతులకు స్వస్తి పలికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్?తో దోమలను నియంత్రించేందుకు వినూత్న ప్రయోగం చేపట్టింది. దీనికోసం ఉస్మానియా విశ్వవిద్యాలయం జీవశాస్త్ర విభాగం కూడా తన వంతు సహకారాన్ని అందిస్తూ దోమల నివారణలో కృషి చేస్తోంది. అసలు ఏఐ ద్వారా దోమల నివారణ సాధ్యమేనా, జీహెచ్ఎంసీ చేస్తున్న ఈ ప్రయోగం ఎంత వరకు సఫలీకృతం కావచ్చనే తదితర వివరాలను జీవశాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ రెడ్యా నాయక్? తెలిపారు. ప్రస్తుత ఉన్న పరిస్థితుల్లో ఏఐ ద్వారా దోమలను నివారించవచ్చని ప్రొఫెసర్ రెడ్యా నాయక్ తెలిపారు. ఏఐను ఉపయోగించి దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించవచ్చని, వాటిని నివారించడానికి అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. 3500 రకాలు దోమలు ఉన్నాయని, వీటితో ఎటువంటి హాని ఉండుదని స్పష్టం చేశారు. కానీ 3 రకాలు దోమలు ఉన్నాయని, క్యూలెక్స్, ఎడిస్, ఎనాఫిలిస్ దోమలు చాలా ప్రమాదకమని హెచ్చరించారు. వాటి నుంచి జాగ్రత్తలు తీసుకుంటే మనం ఉపశమనం పొందవచ్చని, ఈ దోమలు మురుగునీరు, నిల్వఉన్న నీటిలో వృద్ధి చెందుతున్నాయని వివరించారు. "దోమలను నివారించడానికి ఒక ఏరియాను ఎంపిక చేసుకొని ఫాగింగ్ చేసుకోవాలి. ఆ ఏరియా కవర్ అయ్యేలా ఫాగింగ్ చేయాల్సిన అవసరం ఉంది. మనం ఒక గల్లిలో ఫాగింగ్ చేస్తుంటే దోమలు మరో గల్లికి వెళ్తున్నాయి. ఫాగింగ్ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల లోపు చేయాలి. మిగిలిన ఏ సమయంలో చేసిన ఫాగింగ్ వల్ల ఏ ఉపయోగం లేదు. దోమలను నివారించడానికి జీహెచ్ఎంసీ పూర్తి సహకారం ఇస్తాం. దోమలను నివారించడానికి నిత్య ప్రణాళికగా కృషి చేయాలి. లేదంటే దోమలు వస్తూనే



ఉంటాయి"

**దోమల వృద్ధిని నివారించబోతున్న జీహెచ్ఎంసీ**

దోమల నియంత్రణపై జీహెచ్ఎంసీ సాంకేతిక అస్త్రాన్ని ఉపోయోగిస్తోంది. ఏఐ ఉపయోగించి దోమల నివారణకు జీహెచ్ఎంసీ కృషి చేయనుంది. ఓయూ జీవశాస్త్ర విభాగంతో కలిసి దోమల నియంత్రణకు ప్రయోగాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ నగరంలో 14 రకాల దోమ జాతులను ఓయూ జీవశాస్త్ర విభాగం గుర్తించింది. నగరంలో 60 శాతం క్యూలెక్స్ దోమలు ఉన్నట్లు గుర్తించారు. క్యూలెక్స్ దోమలు మురుగునీరు, నిల్వఉన్న నీటిలో వృద్ధి చెందుతున్నాయి. నగరంలో కొత్తగా మాన్సోనియా దోమజాతి పట్టిందని, ఆర్మీజెరిస్ దోమలు గ్రామాల్లో నుంచి నగరానికి వలస వచ్చాయని అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో 27 వేలకుపైగా దోమల హాట్ స్పాట్లను అధికారులు గుర్తించారు. ఏఐ, శాటిలైట్ ఇమేజ్?ల ద్వారా దోమలు వృద్ధి చెందే ప్రాంతాల గుర్తించి, లార్వాను గుర్తించి దోమల వృద్ధిని జీహెచ్ఎంసీ నివారించబోతుంది.

**ఎంటమాలజీ విభాగం పని తీరుపై తీవ్ర విమర్శలు**

ఇంటింటి తనిఖీలు లేకపోవడంతో దోమకాటుతో జనం ఆస్పత్రి పాలవుతున్నారని, ట్రై కార్పొరేషన్ల పరిధిలో ఎంటమాలజీ విభాగం పని తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కార్పొరేషన్ల విభజనతో ఎంటమాలజి సిబ్బంది సరిపడా లేరిని అంటున్నారు. ఎంటమాలజి విభాగంలో గతంలో విధుల్లో 2500 మంది సిబ్బంది ఉన్నారని, డివిజన్ల సంఖ్య 300కు పెరగడంతో ప్రస్తుతం ఎంటమాలజి విభాగంలో అరకొర సిబ్బందే ఉన్నారు.

# సంజయ్‌కుమార్ ఫిరాయింపుతో..

**కరీంనగర్ :** తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌కు వెన్నెముకలా నిలిచిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. 42 ఏళ్ల కాంగ్రెస్ అనుబంధానికి ఇటీవలే స్వస్తి పలికిన రాజకీయ కృరవృద్ధుడు ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమయ్యాడు. జగిత్యాల నియోజకవర్గంలో జీవన్‌రెడ్డి అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డి అనే రీతిలో రాజకీయం సాగింది. కానీ గత కొంత కాలంగా పార్టీ అంతర్గత పరిణామాలు, అవమానాలు ఆయనను తీవ్రంగా కలిచివేశాయి. దీంతో పార్టీకి గుడ్‌బైయ్ చెప్పాడు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడం జీవన్‌రెడ్డి నిర్ణయానికి ప్రధాన కారణమైంది. ఎన్నికల్లో జీవన్‌రెడ్డి ఓటమి పాలవగా, సంజయ్‌కుమార్ గెలిచారు. అనూహ్యంగా సంజయ్ కాంగ్రెస్‌లో చేరడం, ఆయనకు ప్రభుత్వం, పార్టీలో ప్రాధాన్యత పెరగడం జీవన్‌రెడ్డికి మింగుడుపడలేదు. దీంతో కీలక నిర్ణయం తీసుకుని, గులాబీ కండువా కప్పుకోవడానికి సిద్ధమయ్యారు. దీంతో ఇంతకాలం తిట్టిన గులాబీ పార్టీ నేతలతోనే త్వరలో పొగిడించుకోబోతున్నారు.జీవన్‌రెడ్డి చేరిక తర్వాత జగిత్యాల వేదికగానే బీఆర్ఎస్ ప్లీనరీ నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 27న జగిత్యాల సమీపంలోని వ్యవసాయ భూముల్లో భారీ ఎత్తున ఈ సమావేశం నిర్వహించే యోచనలో అధిష్టానం ఉంది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న తర్వాత స్పష్టమైన ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్లీనరీ సభ వేదిక మీదుగానే కేసీఆర్ జీవన్‌రెడ్డికి అప్పగించే బాధ్యతలను ప్రకటించనున్నారు. జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తున్న నేపథ్యంలో బలమైన సంకేతాలను పంపించేందుకు ఈ వేదికను వినియోగించుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారు. జీవన్‌రెడ్డి చేరికతో జగిత్యాల నియోజకవర్గంలో రాజకీయ



సమీకరణాలు మారనున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు బలమైన నేతను కోల్పోయినట్లైంది. బీఆర్ఎస్‌కు మాత్రం బలం చేకూరనుంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల అనంతరం పార్టీ అధిష్టానం పట్ల జీవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. కార్యకర్తలతో సుదీర్ఘ మంతనాల తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు.జీవన్‌రెడ్డి చేరికతోపాటు, ఆయనకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యవేక్షణ బాధ్యతలు ఇవ్వవచ్చని తెలుస్తోంది. కేసీఆర్ హామీతోనే జీవన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జీవన్‌రెడ్డి చేరిక తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కానుంది. కాంగ్రెస్‌లోని ఇతర అసంతృప్త నేతలు కూడా బీఆర్ఎస్‌వైపు చూసే అవకాశం ఉంది. జగిత్యాల ప్లీనరీ ద్వారా బీఆర్ఎస్ తన బలాన్ని చాటుకోవాలని భావిస్తోంది. 42 ఏళ్ల కాంగ్రెస్ ప్రయాణానికి తెరదించి, గులాబీ గూటికి చేరుతున్న జీవన్‌రెడ్డి నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపింది. జగిత్యాల వేదికగా జరగనున్న ప్లీనరీ ఈ మార్పుకు సాక్ష్యం నిలవనుంది.

## ఇదీ మా అభివృద్ధి..

-మొదటిపేజీ తరువాయి

ఎక్కువ. మా జీఎస్‌డీపీ 16.12 లక్షల కోట్లు దాటింది. దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ రెండో ర్యాంకులో ఉంది. మా జియోగ్రాఫికల్ ఏరియా దేశంలో 3.5 శాతం. జనాభా తీసుకుంటే 3శాతం కంటే తక్కువ. కానీ, జాతీయ జీడీపీలో తెలంగాణ వాటా దాదాపు 5 శాతంగా ఉంది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రూ.20,617 కోట్ల మేర రైతు రుణాలను మాఫీ చేశాం. 25.36 లక్షల మంది రైతులను రుణ విముక్తుల్ని చేశాం. ఇది తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది. వ్యవసాయ రాబడులను పెంచేందుకు రైతు భరోసా కింద.. పంటల సాగుబడికి ఏటా ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నాం. వ్యవసాయ పెట్టుబడి కింద ఇప్పటి వరకు రూ.69.70 లక్షల మంది రైతులకు రూ.25,279 కోట్లు ఇచ్చాం. 24 గంటల ఉచిత విద్యుత్ కోసం 29.40 లక్షల మంది రైతులకు.. రూ.26,098 కోట్లు ఖర్చు చేశాం. 14.91లక్షల మంది రైతులకు రూ.5లక్షలు బీమా కోసం రూ.3,124 కోట్లు ఖర్చు చేశాం. క్రాప్ బోనస్ కింద 14.91 లక్షల మంది రైతులకు రూ.3,139 కోట్లు ఇచ్చాం" అని అన్నారు.

## ప్రజల సంక్షేమం తప్ప..
## వ్యక్తిగత ప్రయోజనాలు లేవు

**ఆదిలాబాద్:** అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు. " పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగుతున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ.5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవు" అని భట్టి విక్రమార్క అన్నారు.

## పట్టు బిగిస్తున్న రేవంత్

-మొదటిపేజీ తరువాయి

రోడ్డు షోలలో పాల్గొన్నారు. అక్కడ పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున ఆయన విస్తృతంగా ప్రచారం చేస్తున్కేరళ రాష్ట్రంలో అధికార భాషగా మలయాళం ఉంది. దక్షిణ భారతదేశంలో మలయాళం అనేది అత్యంత క్లిష్టమైన భాష. అందువల్లే రేవంత్ ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో.. ఒక అనువాదకుడిని నియమించుకుంటున్నారు.. "మలయాళ ప్రజలకు నమస్కారం.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయండి. కేరళ రాష్ట్రంలో అభివృద్ధి అంటే ఏంటో కాంగ్రెస్ పార్టీ చూపించింది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి" అంటూ మలయాళంలో రేవంత్ రెడ్డి పలుకుతున్నారు. ఆ ప్రసంగాలకు సానుకూల స్పందన లభిస్తుంది. రేవంత్ రెడ్డి ఇంగ్లీష్లో.. హిందీలో కూడా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారు కాబట్టి.. ఆ రెండు భాషలలో మాట్లాడుతూ మలయాళ ఓటర్ల మనసు చూరగొనే ప్రయత్నం చేస్తున్నారు. కేరళ ప్రజలకు హిందీతోపాటు ఇంగ్లీష్ కూడా వస్తుంది. అందువల్లే తెలంగాణ సీఎం మాటలకు కాస్త రీచ్ కనిపిస్తోంది.రేవంత్ రెడ్డి తో పాటు శ్రీధర్ బాబు కూడా మలయాళ ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. కేరళ రాష్ట్రంలోని మట్టుతారా నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి రోడ్డు షో నిర్వహించారు. అక్కడ బహిరంగ సభ కూడా ఏర్పాటు చేశారు. కేరళ అభివృద్ధికి యుడిఎఫ్ కట్టుబడి ఉందని.. యు డి ఎఫ్ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.. ఇక ప్రచారంలో రేవంత్ రెడ్డి పదేపదే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేస్తున్నారు. కేరళ ముఖ్యమంత్రి విజయన్ పై కూడా విమర్శలు చేస్తున్నారు. మతపరమైన రాజకీయాలను కేరళ ప్రజలు ఒప్పుకోరని.. మతాలపరంగా విడిపోవడానికి సిద్ధంగా ఉండరని రేవంత్ రెడ్డి అంటున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి విజయన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెరచాటుగా ఒప్పందాలు చేసుకున్నారని.. కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రాకుండా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు రేవంత్..కాగా, ఈ స్థాయిలో ప్రచారం చేస్తున్నప్పటికీ సర్వేలలో మాత్రం కేరళ రాష్ట్రంలో విజయన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని తెలుస్తోంది. ఎల్డిఎఫ్ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తుందని సర్వేలు చెబుతున్నాయి. అధికారంలోకి వచ్చినప్పటికీ గతంలో మాదిరిగా మెజారిటీ రాదని.. ఈసారి తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో ప్రస్తుత ముఖ్యమంత్రి కి తిరుగులేదని.. నగర ప్రాంతాలలో తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తోందని సర్వేలు చెబుతున్నాయి.. సర్వేలలో వచ్చిన నివేదికలను ఒకసారి పరిశీలిస్తే కేవలం 30 శాతం మంది మాత్రమే విజయన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని.. ఇతర వ్యక్తులు ప్రత్యామ్నాయం ఉంటే బాగుంటుందని చెబుతున్నారని తెలుస్తోంది. అయితే మిగతా పార్టీలలో అగ్ర నాయకులు అంత గొప్పగా లేకపోవడం విజయన్ కు కలసి వస్తోంది.

## ఏమౌతోంది... ఐఎఎస్ ఆఫీసర్లు,,,

**కరీంనగర్ :** భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు సీఎం ఓలో ప్రియాంక వర్గీస్, స్మిత సబర్వాల్ కీలక అధికారులుగా ఉండేవారు. వారితోపాటు జయేష్ రంజన్ కూడా ఉండేవాడు. సీనియర్ ఐఏఎస్ అధికారిగా.. అప్పట్లో ఐటీ కార్యకలాపాలను పర్యవేక్షించిన అధికారిగా జయేష్ సుపరిచితుడు. నాడు పరిశ్రమల శాఖ మంత్రిగా.. ఐటీ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ కు అత్యంత సన్నిహితుడిగా ఉండేవాడు.భారత రాష్ట్ర సమితి అధికారం కోల్పోయిన తర్వాత కొద్ది రోజులపాటు రంజన్ ఐటీ కార్యకలాపాలను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెట్టుబడుల సదస్సు కోసం వెళ్ళినప్పుడు రంజన్ కూడా ఆయన వెంట ఉన్నారు. అయితేనాడు కుదుర్చుకున్న ఎం ఓ యు వ్యవహారాలలో లోపాలు ఉన్నాయని భారత రాష్ట్ర సమితి ఆరోపించింది. ఆ ఆరోపణలు తగ్గట్టుగానే ప్రభుత్వ వ్యవహార శైలి ఉండడం ఆందోళన కలిగించింది. చివరికి రంజన్ సెల్ఫీ వీడియో తీసి.. తెలంగాణ ప్రజలకు వివరణ ఇవ్వాల్సి వచ్చింది.ఈ ఉదంతం రంజన్ మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆగ్రహాన్ని కలిగించిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత గ్లోబల్ సమ్మిట్ విఫలం కావడంతో రంజన్ వ్యవహార శైలి పై మరోసారి చర్చ జరిగింది. గ్లోబల్ సమ్మిట్ జరిగేటప్పుడు కీలక సమాచారం భారత రాష్ట్ర సమితి చేతుల్లోకి వెళ్ళింది. దీంతో అప్పుడే ప్రభుత్వం అప్రమత్తమయింది. వెంటనే లోతుగా విచారణకు ఆదేశించింది. దీంతో కొంతమంది అధికారులు కావాలని ప్రభుత్వ సమాచారాన్ని ప్రతిపక్ష పార్టీకి అందిస్తున్నారని అందులో తేలింది. ఇక అప్పటినుంచి జయేష్ మీద ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. అతడిని ఐటీ విభాగం నుంచి దూరం చేసింది. ఆ తర్వాత ఇప్పుడు సీఎం ఓ నుంచి కూడా పక్కనపెట్టింది. ఆయనకు క్రీడా శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది.గతంలో జయేష్ కేటీఆర్ కు దగ్గరగా ఉండటంవల్ల.. కీలకమైన విషయాలు ఆయన ద్వారా ప్రతిపక్ష పార్టీకి తెలుస్తున్నాయని ప్రభుత్వానికి సమాచారం ఉండడం వల్ల.. రేవంత్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జయేష్ కు స్థానచలనం తప్పదని ప్రచారం జరిగింది. అయితే రేవంత్ ప్రభుత్వం కొద్దిరోజులపాటు అతడినే అదే శాఖలో కొనసాగించింది. చివరికి ప్రభుత్వం నుంచి కీలక సమాచారం బయటకు పోతున్న క్రమంలో.. ప్రక్షాళనకు రేవంత్ రెడ్డి నడుం బిగించారు. తన వేగుల ద్వారా సమాచారం తెప్పించుకుని.. సరైన సమయంలో.. సరైన విధంగా వేటు వేశారు. పైకి క్రీడాభివృద్ధి అని చెబుతున్నప్పటికీ .. అసలు అంతరార్థం వేరే ఉందని విశ్లేషకులు అంటున్నారు. మొత్తానికి సీఎంఓ నుంచి జయష్ ను పంపించడం ద్వారా పూర్తిగా ప్రక్షాళన చేసామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. రేవంత్ వచ్చిన తర్వాత ప్రియాంక, స్మిత.. ఇప్పుడు జయేష్ సీఎం ఓ నుంచి బయటికి వెళ్లిపోయారు. స్మిత అనారోగ్యం వల్ల లాంగ్ లీవ్ లో ఉన్నారు.

# నూతన విద్యా సంవత్సరంగాను ముందస్తు విద్యార్థుల నమోదుకై ర్యాలీ

**ప్రధానోపాధ్యాయులు గంగిశెట్టి మహేందర్.**

**హుస్నాబాద్ :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గంగిశెట్టి మహేందర్ ఆధ్వర్యంలో వచ్చే విద్యా సంవత్సరం గాను ముందస్తు విద్యార్థుల నమోదుకై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 11వ,వార్డు 15వ వార్డు 17వ వార్డులో పర్యటించడం జరిగింది. 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురుకుల పాఠశాలలకు తీసిపోని సౌకర్యాలు ఉన్నాయని, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. 17వ, వార్డు కౌన్సిలర్ గాదపాక రవీందర్ మాట్లాడుతూ పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హుస్నాబాద్ మండలంలో అత్యుత్తమ మైన ప్రమాణాలతో అన్ని సౌకర్యాలతో ఉన్న ఏకైక పాఠశాల అని అన్నారు. ప్రజలందరూ వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపి ఆర్థిక భారం పెంచుకోవడం తప్ప ఏమీ లేదని, అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలని అన్నారు. 15వ,వార్డు కౌన్సిలర్ ఆకుల రజిత వెంకన్న మాట్లాడుతూ పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆధునాతనమైన సైన్స్ ల్యాబ్, ఐటి/ఐటిఈఎస్, ఆటోమోటివ్ లాంటి ఏ పాఠశాలలో లేని ఒకేషనల్ కోర్సు, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఉచిత విజ్ఞాన యాత్ర, ఇండస్ట్రియల్ టూర్స్, కరాటే, యోగ, ఉచిత నోట్ బుక్స్,టెక్స్ట్ బుక్స్, యూనిఫామ్,రుచికరమైన మధ్యాహ్న భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్య బోధన,పరిశుభ్రమైన డైనింగ్ హాల్, మినరల్ వాటర్, డిజిటల్ క్లాసెస్, స్పోర్ట్స్,ప్రతి సంవత్సరం విద్యార్థులకు సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్స్, లైఫ్ స్కిల్స్ ట్రైనింగ్స్ తోపాటు పిల్లల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే వసతులు కేవలం పిఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోనే ఉన్నాయని అలాగే రాబోయే సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వం ఉదయం అల్పాహారం షూ,టైస్, బెల్ట్స్, అందజేస్తుందని ఇన్ని సౌకర్యాలు ఉన్న పాఠశాలల లో మీ యొక్క పిల్లలను చేర్చి ప్రభుత్వం కల్పించే అన్ని వసతులను ప్రజలు వినియోగించు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు జి.నరేందర్ పి లక్ష్మయ్య ఎస్ రవీందర్ పి రాజయ్య వి.యుగంధర్ రెడ్డి, బి.మనోహర్, జి.రవీందర్, సత్య నారాయణ రెడ్డి,ఎం. వనమాల, కే.శ్వేత టి.నవీన్ కుమార్ ఏ.రేణుక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# జెకె -5 ఓసీ కొనసాగించి నిర్వాసితులకు న్యాయం చేయాలి

**జాయింట్ కలెక్టర్ ను కలిసిన సర్పంచ్‌లు, అఖిలపక్ష కమిటీ సభ్యులు**

**పూర్తిస్థాయిలో న్యాయం జరిగినాడే ఖాళీ చేస్తాం**

**కొత్తగూడెం సింగరేణి :** ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి ఇల్లందు ఏరియాలో గల జెకె -5 ఉపరితల బొగ్గుగనిని కొనసాగింప చేసి నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆ ప్రాంత నిర్వాసితులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీన్ వెన్స్ డే లో విజయలక్ష్మి నగర్ తిలక్ నగర్ సర్పంచులు వినతి పత్రాన్ని అందజేశారు. పూర్తిస్థాయిలో న్యాయం జరిగిన నాడే ఆ స్థలాలను ఖాళీ సర్పంచులు చాందవ రమేష్ బాబు, ధనసరి స్రవంతి, ఆధ్వర్యంలో 21 అఖిలపక్ష కమిటీ నాయకులు జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ ని కలిసి కోరారు. కాగా తమ ముత్తాతలు, తాతలు , తండ్రులు సింగరేణి కి సేవలందించి రిటైర్అయి ఇక్కడే నివాసం ఉంటున్న మమ్మల్ని తక్షణమే ఖాళీ చేయాలని అధికారుల ఆదేశాలు ఇవ్వడం సరైంది కాదని ఆ వినతిపత్రం పేర్కొన్నారు. అంతేగాక ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా వెంటనే ఖాళీ చేయాలని సింగరేణి యాజమాన్యం తమపై ఒత్తిడి తీసుకొచ్చి భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా తక్షణమే ఈ సమస్యపై స్పందించి తమకు న్యాయం చేయాలని వారు జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ ని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ లు, అఖిలపక్ష కమిటీ నాయకులు ఓసీ విషయం పై జాయింట్ కలెక్టర్ కు వివరిస్తూ దాదాపు 130 ఏళ్ల తరబడి నివాసం ఉంటున్నామని పేర్కొన్నారు. అయితే ఇక్కడున్న ప్రజలందరూ మాజీ కార్మికుల కుటుంబ సభ్యులేనని, ఆనాడు సింగరేణి కి సేవలు అందించి,ఎటు వెళ్లలేని పరిస్థితిలో ఇక్కడే నివాసముండిపోయామని ఆ వినతిపత్రంలో వివరించారు. దాదాపు 20, 30 సంవత్సరాల నుండి ఈ ప్రాంతాలను సింగరేణి ఎలాంటి అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యానికి గురి చేసిందని, ప్రాజెక్టు కోసమని మా స్థలం మాకు కావాలని దౌర్జన్యానికి పాల్పడుతుందని వాపోయారు. జెకె 5 ఓ సి కొనసాగింపులో భాగంగా 21 ఫిట్ ఏరియా నిర్వాసిత ప్రాంతాలైన విజయలక్ష్మి నగర్,ఇతర ప్రాంత ప్రజలను ఉన్నపలంగా ఖాళీ చేయాలని ఎలాంటి నోటీసులు లేకుండా తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఎలాంటి సమాచారం లేకుండా ఖాళీ చేయమని సింగరేణి అధికారులు ఇంటింటికి తిరుగుతూ చెబుతున్నారని తెలిపారు. దీనికి సంబంధించి గతంలోని చట్ట ప్రకారం మాకు రావలిసినవి ఇవ్వాలి అని అఖిలపక్షం చేపిందని వివరించారు. అంతేగాక నిర్వాసితులకు రావాల్సిన నష్టపరిహారాన్ని ఇచ్చిన తర్వాతనే ఖాళీ చేస్తామని స్పష్టంగా సింగరేణి యాజమాన్యానికి తెలియజేయడం జరిగిందని కలెక్టర్కు అందించిన వినతిపత్రంలోపేర్కొన్నారు.సింగరేణి అధికారులు అఖిలపక్ష కమిటీ వద్దకు వచ్చి సహకరించాలని కోరినప్పటికీ మేము ప్రాజెక్టు స్వాగతిస్తూనే ప్రజలకు న్యాయం చేయాలని ప్రార్థించామని తెలిపారు. అంతేగాక గతంలో చెప్పిన కొన్ని డిమాండ్లను వారు అంగీకరించి మా సహకారంతో సర్వే మొత్తం పూర్తి చేసుకొని ఈరోజు ఆ మాటలను తుంగలో తొక్కి వెంటనే ఖాళీ చేయాలని హుకుం జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ న్యాయమైన డిమాండ్లు ఇలా ఉన్నాయి. జెకె 5 ఓసీ లో ఏదైతే నిర్వాసితులకు ఇచ్చిన విధంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని జెకె 5 ఉపరితలం గని కొనసాగింపులో నిర్వాసితులకు ఉన్న ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. అంతేగాక నిర్వాసిత కుటుంబంలోని ప్రతి వ్యక్తికి న్యాయం చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఇచ్చిన విధంగా అన్ని సదుపాయాలని సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేయాలన్నారు. నూతన ఇల్లు కట్టే వరకు నిర్వహస్థితులకు అకామిడేషన్ ఇప్పించాలన్నారు. రెండు గ్రామ గ్రామపంచాయతీలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలని కోరారు. గ్రామపంచాయతీలో నివాసం ఉంటున్న సొంతిల్లు కట్టుకున్న ప్రజలకు రెవెన్యూ కు అప్పగించి పట్టాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి కోటర్స్ ను నివాసముంటున్న ప్రజలకు అప్పజెప్పి అదే విధంగా సింగరేణి కరెంటు తీసి ప్రభుత్వ కరెంటు ఇచ్చే విధంగా సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ కి వివరించారు. దీంతో జాయింట్ కలెక్టర్ పూర్తి వివరాలతో రావాలని సింగరేణి అధికారులకు లెటర్ పంపిస్తాం అన్నారు.ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తాండ్ర నాగరాజు, ఎట్టి హరికృష్ణ, వడ్రల శ్రీను, క్లింట్ రోచ్, తేజవత్ లాలు,సదారం చిన్నారి, ధనసరి రాజు, బానోత్ హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.



# పిఎం సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

**భద్రాద్రి :** సోమవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజన పథకంపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజనను జిల్లాలో అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా ఇళ్ల పైభాగంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని, స్వయం విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు.సోలార్ విద్యుత్ వినియోగం పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు . అదనంగా, వినియోగించని విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి తిరిగి ఆదాయం పొందే అవకాశాన్ని ఈ పథకం కల్పిస్తుందని తెలిపారు.దేశవ్యాప్తంగా ఒక కోటి కుటుంబాలకు ప్రతి నెల 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం ఈ పథకం లక్ష్యమని వెల్లడించారుసబ్సిడీ వివరాలను తెలియజేస్తూ, 2 కిలోవాట్ వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.30,000, 3 కిలోవాట్ మరియు అంతకంటే ఎక్కువ సామర్థ్యంపై అదనంగా రూ.18,000 సబ్సిడీ అందించబడుతుందని తెలిపారు.పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, విద్యుత్ బిల్, బ్యాంక్ పాస్‌బుక్, ఫోటో అవసరమని తెలిపారు. అర్హులైన వినియోగదారులు అధికారిక వెబ్‌సైట్ జూఎబబీతీఎజీణష్ట్రజీతీ.ణనీల.తిని లో నమోదు చేసుకుని రాష్ట్రం, విద్యుత్ పంపిణీ సంస్థ, కస్టమర్ నంబర్ తదితర వివరాలను నమోదు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా మేనేజర్ పి. అజయ్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## మైనర్ బాలిక కిడ్నాప్, అత్యాచారయత్నం.. నిందితుడి అరెస్టు

**నిందితుడిపై పోక్సో కేసు నమోదు: ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి**

**జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ 30 అమలు.. ధర్నాలకు అనుమతి లేదు**

**సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు**



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి యత్నించిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు. సోమవారం బోథ్ మండల కేంద్రంలో ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన నిందితుడు.. ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న వెంటనే అప్రమత్తమైన పోలీసులు, నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిందితుడిపై బోథ్ పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్, అత్యాచార యత్నంతో పాటు పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరూ సమానమేనని, అఘాయిత్యానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

**పోలీస్ యాక్ట్ 30 అమలు.. ర్యాలీలు, ధర్నాలకు నో పర్మిషన్..**

జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టడం పూర్తిగా నిషేధమని డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించరాదని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

**సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా..**

ఈ ఘటనను ఆసరాగా చేసుకొని సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసే వారిపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఉంచిందని డీఎస్పీ తెలిపారు. తప్పుడు పోస్టులు పెడుతూ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సంయమనం పాటించి పోలీసుల విచారణకు సహకరించాలని ఆయన కోరారు.

## కోటగిరిలో వరి ధాన్యం ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్, సర్పంచ్

**వాస్తవ నేస్తం,కోటగిరి :** మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్, ఏఎంసీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు తొందరపడి దళారులను నమ్మి ప్రైవేటు వ్యక్తులకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ప్రభుత్వం కల్పించిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం.. 'ఏ' గ్రేడ్ రకానికి క్వింటాకు రూ. 2,389, 'బి' గ్రేడ్ రకానికి రూ. 2,269 మద్దతు ధర లభిస్తుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో కోటగిరి తహశీల్దార్ కాంబ్లే గంగాధర్, ఏఈఓ రేష్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, సహకార సంఘం మాజీ అధ్యక్షులు సిద్దు, మాజీ డైరెక్టర్ కొయ్యగుర్ శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు పుల్లెల మోహన్ రావు, కూచి శ్రీనివాస్ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## యువత భవిష్యత్తు కోసం పోలీసుల నజర్ : పాన్ షాపుల్లో ముమ్మర తనిఖీలు




**వాస్తవ నేస్తం,కోటగిరి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఎస్సై సునీల్ నేతృత్వంలో కోటగిరి మరియు పోతంగల్ గ్రామాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. యువతను వ్యసనాల బారి నుండి రక్షించే లక్ష్యంతో స్థానిక పాన్ షాపులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఎస్సై సునీల్, 21 సంవత్సరాల లోపు ఉన్న యువతకు గుట్కా, సిగరెట్, బీడీలు మరియు ఇతర హానికరమైన మత్తు ,పదార్థాలను విక్రయించడం చట్టరీత్యానేరమని వ్యాపారులకుస్పష్టంచేశారు. నిబంధనలను, అతిక్రమించకూడదని హెచ్చరిస్తూ ప్రతి షాపు వద్ద అవగాహన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘించి యువతకు మత్తు పదార్థాలు విక్రయిస్తే సదరు వ్యాపారులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై హెచ్చరించారు. యువత తమ భవిష్యత్తును పాడుచేసుకోకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరిన ఈ తనిఖీ కార్యక్రమాల్లో పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ పై పోరాటం

**కరీంనగర్ :** డంపింగ్ యార్డ్ ఏర్పాటు అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు. హుజురాబాద్ పట్టణంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. జేఏసీ (ఏంఅ) ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుండి బుధవారం ఉదయం 10 గంటల వరకు 24 గంటల పాటు నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ డంపింగ్ యార్డ్ వల్ల వచ్చే ముప్పు కరోనా వైరస్ కంటే ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఈ పోరాటం ఏ ఒక్కరి కోసమో కాదని, మన ప్రాంత ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు తరాల మనుగడ కోసం చేస్తున్న పోరాటమని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com